క్లుప్తంగా

కరకట్టపై ముళ్లపొదల తొలగింపు



కరకట్టపై తుమ్మచెట్ల తొలగింపును పర్యవేక్షిస్తున్న ఇరిగేషన్ అధికారులు

దుమ్ముగూడెం: మండలంలోని దుమ్ముగూడెం గ్రామం చుట్టూ ఉన్న గోదావరి కరకట్టపై జంగిల్ క్లియరెన్స్ పనులను ఇరిగేషన్ అధికారులు గురువారం చేపట్టారు. రాకపోకలు అంతరాయం లేకుండా కరకట్టపై ఉన్న చెట్ల పొదలను, తుమ్మ చెట్లను చైన్ మిషన్‌తో తొలగించే పనులను చేపట్టారు. కార్యక్రమంలో డీఈ మధుసూధన్‌రావు, జేఈ రాజ్‌సుహాస్, పీటీ మస్తాన్ వలీ పాల్గొన్నారు.

ఏడీఏ బాధ్యతల స్వీకరణ



అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గ వ్యవసాయ శాఖ ఏడీఏగా రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కలెక్టరేట్ వ్యవసాయ శాఖ సాంకేతిక విభాగంలో విధులు నిర్వహిస్తుండగా బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో ఏడీఏగా విధుల్లో చేరారు. ఇప్పటి దాకా ఇక్కడ పని చేసిన ఏడీఏ అఫ్జల్ బేగం సాధారణ బదిలీల్లో సిరిసిల్ల జిల్లా డీఏవోగా బదిలీపై వెళ్లారు. విధుల్లో చేరిన ఏడీఏ రవికుమార్ స్థానిక కార్యాలయంలో మండలంలోని ఎరువులు, పురుగు మందుల డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు.

డ్రగ్స్‌పై అవగాహన

చండ్రుగొండ: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై గంజి స్వప్న సూచించారు. చండ్రుగొండ జెడ్పీ హైస్కూల్‌లో డ్రగ్స్‌పై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడారు. మత్తుకు అలవాటుపడి, జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రత్యేక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమాన్ని ఓర్వలేకనే విమర్శలు

దుమ్ముగూడెం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, విపక్షాలు విమర్శలు చేస్తున్నాయని కాంగ్రెస్ మండల నాయకుడు లంకా శ్రీనివాసరావు అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీకి రూ.31 వేలకోట్లను రైతుల ఖాతాలకు పంపిణీ చేసే అతి పెద్ద కార్యక్రమంలో అక్కడక్కడ చిన్నచిన్న అవాంతరాలు సహజమని అన్నారు. కుంజా శ్రీనివాసరావు, పిలక వెంకటరమణారెడ్డి,కొమ్ము రంజిత్, కోడి చంటి, గడ్డం బాలాజీ, కెల్లా శేఖర్, లంక రాంప్రసాద్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ..

అశ్వాపురం: మండల కేంద్రంలోని భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో గౌతమీనగర్ రెసిడెన్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కోల్‌కత్తాలో వైద్యురాలు హత్యకు నిరసనగా గురువారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారజల కర్మాగారం ఐఆర్‌ఓ లత, డీజీఎం సతీమణి ఓమా శర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ సెక్రటరీ అజయ్‌కుమార్, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు రాయల రాజేష్, కుటుంబరావు, సుబ్బారావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు పంపిణీ

దుమ్ముగూడెం: మండలంలోని వైట్‌నాగారం గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు ఎఫికర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, అధ్యయన సామగ్రి గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దశరథం మాట్లాడుతూ.. నోట్ పుస్తకాల వితరణను అభినందించారు. ఉపాధ్యాయులు మోహనా చారి, ఎఫికర్ స్టాఫ్ కిరణ్ బాబు, జాన్ బాబు పాల్గొన్నారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను చిరంజీవి అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలోని ఆటో అడ్డా వద్ద కేక్ కత్తిరించి,స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భారత రాంబాబు, శంకర్, వీరస్వామి, జమలయ్య పాల్గొన్నారు.

మణుగూరురూరల్: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పవర్ స్టార్ పవన్ కల్యాణ్ పినపాక నియోజకవర్గ అభిమాన సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మణుగూరు అటవీశాఖ కార్యాలయంలో తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, అభిమానులు సుమారు 50 మొక్కలు నాటారు. సంఘం గౌరవ అధ్యక్షుడు బేతంచర్ల వెంకటేశ్వరరావు, నాయకులు సురేందర్ పటేల్, ప్రదీప్‌కుమార్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

‘అమ్మ పేరు మీద ఓ మొక్క’

- మొక్కలు నాటిన విద్యార్థులు, అధికారులు
- సంరక్షణ చర్యలకు పిలుపు



మణుగూరుటౌన్: మొక్కలు నాటుతున్న మున్సిపల్ అధికారులు



దుమ్ముగూడెం: మొక్క నాటుతున్న విద్యార్థులు, పక్కన అధ్యాపకులు

విద్యాలయాల్లో..

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం మొక్కలను నాటారు. కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేపీ డి.వరరాజు మాట్లాడుతూ.. ‘ప్లాంట్ వన్ ట్రీ ఫర్ మదర్’అనే నినాదంతో మొక్కలు నాటేందుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ వాలంటీర్ మొక్కలను కాపాడే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, కళాశాల ఎన్‌యస్‌యస్ ప్రోగ్రాం అధికారి మల్లెల శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని మండల ప్రత్యేక అధికారి, ఏడీ ప్రదీప్‌కుమార్ అన్నారు. గురువారం అశ్వారావుపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ, పాఠశాల విద్యార్థులతో వివిధ రకాల మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొక్కల పెంపకంతోనే భవిష్యత్ తరాలకు మనుగడ సాధ్యమని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో రామచంద్రరావు, హెచ్‌ఎం నల్లపు కొండలరావు, ఫిల్డ్ అసిస్టెంట్ ఎం వెంకటేశ్వరరావు, సిబ్బంది కామేష్, నాగేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో..

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని అన్నారంలో ‘నాటుదాం ఒక చెట్టు అమ్మ పేరు మీద ’కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, అధికారులు అన్నారం గ్రామంతో పాటు మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల్లో 220 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వాములై తప్పనిసరిగా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ సత్యనారాయణ, సరిత, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో..

మణుగూరురూరల్: నాటుదాం ఒక మొక్క–అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా గుట్టమల్లారంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ విస్తరణ అధికారి(ఏఈఓ) కొమరం లక్ష్మణ్‌రావు, పలు గ్రామపంచాయతీలో ఎంపీఓ పల్నాటి వెంకటేశ్వరరావులు గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో గ్రామపంచాయితీల కార్యదర్శులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలి



ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్

భద్రాచలంఅర్బన్: ప్రయాణికుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్ ఆటో డ్రైవర్లకు సూచించారు. గురువారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్ మాట్లాడుతూ.. డ్రైవర్లు యూనిఫాం కచ్చితంగా ధరించాలని, రోడ్లపై ఆటోలను ఇష్టానుసారంగా నిలుపవద్దని సూచించారు. కొందరు ఆటో డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వెంటనే వ్యవహార శైలి మార్చుకోవాలని ఆయన హెచ్చరించారు. భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చే భక్తులు, ఇతర ప్రయాణికుల పట్ల ఆటోలలో ప్రయాణించే సమయంలో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఏఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మధుప్రసాద్, ఏఎస్ఐ లు, ట్రాఫిక్ పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

వైద్యులతో సమావేశం..

భద్రాచలం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులతో గురువారం భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ ఆసుపత్రిలోనైనా రోగి ఆరోగ్య పరిస్థితి చేరే సమయంలోనే ఆందోళనకరంగా ఉంటే ముందస్తుగా పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. ప్రతి ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకులు రోగులకు సంబంధించిన ఓపీ, ఇన్‌పేషెంట్ పొందు పరిచేందుకు తప్పనిసరిగా రిజిస్టర్‌ను మెయింటైన్ చేయాలని, ఆస్పత్రిలో సీసీ టీవీ ఏర్పాటు చేసి, వాటి రికార్డులు 15 రోజుల వరకు బ్యాకప్ (స్టోరేజ్) ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ డాక్టర్ రమేష్ చంద్ర, సభ్యులు విజయరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

లాజిస్టిక్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



లాజిస్టిక్ సేవలను ప్రారంభిస్తున్న మేనేజర్ శ్యాం కుమార్

కరకగూడెం: ఆర్టీసీ లాజిస్టిక్ సేవలను మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని మణుగూరు డిపో మేనేజర్ పి.శ్యాంకుమార్ సూచించారు. ఈ మేరకు అయన గురువారం మండల కేంద్రంలోని ‘శ్రీ వెంకటేశ్వర పద్మావతి ఆన్ లైన్’సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్(కార్గో) సర్వీస్ పాయింట్ ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సేల్స్ టీం లీడర్ హరి వర్మ, ఆపరేషన్ టీం లీడర్ పాషా, కరకగూడెం లాజిస్టిక్స్ ఏజెంట్ అత్తె నాగరాజు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పొదెం వీరయ్యకు ఘన స్వాగతం



మణుగూరుటౌన్: పొదెం వీరయ్యకు స్వీట్ తినిపిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

మణుగూరుటౌన్: తెలంగాణ అటవీ శాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారి మణుగూరుకు వచ్చిన పొదెం వీరయ్యకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరినాకి నవీన్ ఆధ్వర్యంలో గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తా వద్ద టపాసులు పేల్చి కేరింతలు కొడుతూ.. పూలమాలలు వేసి సన్మానించారు. మిఠాయిలు తినిపించారు. అనంతరం పొదెం వీరయ్య నాయకులతో కలిసి కొమరంభీం, అంబేడ్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యకర్తలతో మాట్లాడి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. తనకు సహకారం అందించి తన వెన్నంటి ఉన్న క్యాడర్‌కు ధన్యవాదాలు తెలిపారు. నాయకులు టీపీసీసీ సభ్యులు చందా సంతోష్, కాటబోయిన నాగేశ్వరరావు, కొర్సా ఆనంద్, సాయిన్ని వెంకటేశ్వరరావు, భోగినేని వరలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, కుర్రం రవి, కొత్తపల్లి సత్యనారాయణ, పెనుగొండ సాంబశివరావు, బాబ్‌జాన్, రహీం, పాలమూరి రాజు, ఆలెం కోటి తదితరులు పాల్గొన్నారు.

పినపాక: చైర్మన్ హోదాలో మొదటిసారి విచ్చేసిన వీరయ్యకు స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. అనంతరం వీరయ్య మాట్లాడుతూ.. కార్యకర్తలను ఎల్లప్పుడూ కాపాడుకుంటానని, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామనాథం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అశ్వాపురం: అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా అశ్వాపురం వచ్చిన మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్యను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, తూము పెదవీరరాఘవులు, ఆవుల రవి, బచ్చు వెంకటరమణ, మచ్చా నరసింహారావు, చెంచల రాము, బారాసు సంపత్, సామకూరి వెంకన్న, నరసింహారావు, అండెం గంగరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు, శివకామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు పొదెం వీరయ్యను శాలువాతో సన్మానించారు.

‘డయాలసిస్’ను సద్వినియోగం చేసుకోండి

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో అందిస్తున్న ఉచిత డయాలసిస్ సేవలను కిడ్నీ వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా రుక్మిణి కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఖరీదైన డయాలసిస్ సేవలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని తెలిపారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడే రోగులకు సమయంతో సంబంధం లేకుండా ఇరవై నాలుగు గంటలు సేవలు అందించేందుకు వైద్యులు సిద్ధంగా ఉంటారని, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు వృథా చేసుకోవద్దని సూచించారు. స్థానిక ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ కేంద్రంలో అశ్వారావుపేటతోపాటు దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండతో పాటు ఇతర మండలాల నుంచి వచ్చే వారికి కూడా సేవలు అందుతాయన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మణుగూరురూరల్: మండలంలోని హనుమాన్ టెంపుల్ జంక్షన్ వద్ద మణుగూరు ఎస్సై మేడ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి గురువారం వాహనాలను తనిఖీ చేశారు. మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రతీ వాహనాన్ని నిలిపి సంబంధిత పత్రాలను, పెండింగ్ ఛలాన్ల వివరాలను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించి వదిలేశారు. సరైన పత్రాలు లేని వాహన యజమానాలను ఈ–ఛలానాలను విధించారు. ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని ఎస్సై సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎల్‌ఓల ఇంటింటి సర్వే

భద్రాచలంఅర్బన్: నూతన ఓటరు జాబితా సవరణకు జిల్లా అధికారులు ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు. దీనిలో భాగంగా బుధవారం భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ పట్టణంలో ఉన్న బీఎల్‌ఓలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని 41 మంది బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి నూతన ఓటరు జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పుల కసరత్తు చేస్తున్నారు.

నోడల్ అధికారికి సన్మానం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటేశ్వరరావు విధుల నిర్వహించి పదోన్నతి పొంది ఇటీవల జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాశాఖ అధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో భద్రాచలం ప్రభుత్వ కళాశాలను గురువారం ఆయన సందర్శించారు. డీఐఈఓగా అధికారిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొట్టమొదటి సారి భద్రాచలం రావడంతో కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి, అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. భద్రాద్రి రాముల వారి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరాల ఏర్పాటు



కాలనీ వాసులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ నిశాంత్‌రావు

మణుగూరురూరల్: మండల పరిధిలోని శాంతినగర్, బెస్తగూడెం, బీసీకాలనీలలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆయా శిబిరాల్లో పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్‌రావు గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం ప్రతీ ఇంటిని సందర్శించి పరిసరాలను పరిశీలించడంతో పాటు నీరు నిల్వ ఉన్న కంటైనర్లను శుభ్రం చేయించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ అనసూర్య, వైద్యసిబ్బంది రాంప్రసాద్, రాధ, సుజాత, శైలజ, కౌసల్య, ఎంఎల్‌హెచ్‌పీలు మనీషా, ప్రియభారతి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదాన కార్యక్రమం

మణుగూరురూరల్: మండలంలోని సాయినగర్‌లో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయంలో గురువారం సందర్భంగా సాయినాథుడికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మణుగూరు ప్రాంతానికి చెందిన గొల్లపల్లి భాస్కర్‌రావు–భారతి దంపతులు, వారి కుమారుడు రమేష్–మల్లీశ్వరి దంపతులు, కౌశిక్ వర్ధన్, నిహార్ ఆదిత్యలు ఆలయంలోని సాయినాథుడిని దర్శించుకుని పూజ కార్యక్రమాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్.బాలకేశవరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, గుమస్తా వెంకన్న, సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠ




పూజలు నిర్వహిస్తున్న విగ్రహ నిర్మాణ దాతలు

గుండాల: మండల కేంద్రంలో 27 అడుగులతో నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా విగ్రహ నిర్మాణ దాత తిరుక్కొవళ్లూరి వెంకటేశ్వర్లు (పట్వారి వెంకన్న)– హరిప్రియ దంపతులు పూజలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ తీర్థం రామకృష్ణ, శర్మ, రామాలయ అర్చకులు సనత్ కుమార స్వామి ఆధ్వర్యంలో ఏకాహ్నిక దీక్షతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం యంత్ర, అభయ ఆంజనేయ స్వామి దేవత ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండల కేంద్రం నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొత్త గనులు ప్రారంభించాలి

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలో సింగరేణి పరిరక్షణకు కొత్త గనులు ప్రారంభించాలని ఇఫ్టూ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టూ నాయకులు నాజర్‌పాషా మాట్లాడుతూ.. ప్రస్తుతం బొగ్గు ఉత్పత్తి పనులు కొనసాగుతున్న గనుల్లో ఐదు లేదా ఆరు సంవత్సరాలలో ఉత్పత్తి నిలిచిపోనుందని, ఇప్పటి నుంచే ప్రభుత్వం స్పందించి మణుగూరులో కొత్త భూగర్భ గనుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మణుగూరు ఏరియా అధ్యక్షుడు మంగీలాల్, సాధనపల్లి రవి, ఆర్.విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

పామాయిల్ సాగుకు ప్రోత్సాహం



పామాయిల్ మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ, ఏఓ, ఏపీఓ, రైతులు

బూర్గంపాడు: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో రైతులకు పామాయిల్ సాగు చేసేందుకు ప్రోత్సాహకాలను అందిస్తున్నట్లు ఎంపీడీఓ జమలారెడ్డి అన్నారు. సోంపల్లి గ్రామంలో ఐదుగురు రైతుల భూముల్లో ఉపాధిహామీ పథకంలో పామాయిల్ సాగును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పామాయిల్ మొక్కలను రైతులకు ఉచితంగా అందించి సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా డ్రిప్ ఇరిగేషన్ స్కీమ్ కోసం ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం రాయితీని అందిస్తున్నామన్నారు. ఉపాధిహామీ పథకంలో పామాయిల్ సాగు చేసిన రైతులకు తొలి సంవత్సరం రూ.42,662, రెండో సంవత్సరం రూ.26,220, మూడో సంవత్సరం రూ 26,220లు మొత్తంగా రూ.95,102లను అందిస్తున్నామన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించేందుకు రైతులు పామాయిల్ సాగుకు మొగ్గుచూపాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శంకర్, ఏపీఓ విజయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి వెంకటేష్, రైతులు పండగ రాములు, పండగ వెంకటేశ్వర్లు, బర్ల వెంకటేశ్వర్లు, వెంకటప్పయ్య, పొందు పెద్దబిక్షం, దనుగూరి శ్రీనివాస్, పెంకే దారుగా,పండగ భాస్కర్, బింగి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి

రైతులందరికీ బేషరతుగా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా మండల కేంద్రాల్లో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాలు, కూడళ్ల వద్ద ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు షరతులుగా విధించి రుణమాఫీ ప్రక్రియను అపహాస్యం చేస్తోందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పినపాక: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



అశ్వారావుపేటరూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



ములకలపల్లిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు



బూర్గంపాడు: తహసీల్ ఇన్‌చార్జ్‌కు వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



చండ్రుగొండ జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం



అన్నపురెడ్డిపల్లి: తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు



అశ్వాపురం: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్న బీఆర్ఎస్ నాయకులు



కరకగూడెంలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు